ప్రజాశక్తి

సోమవారం 16 సెప్టెంబర్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

ఐదేళ్ల తర్వాత మళ్లీ భూ సమీకరణ!

- యర్రబాలెంలో రైతుల నుంచి భూములు తీసుకున్న మంత్రి నారాయణ
- 217 కిలో మీటర్ల పరిధిలో రాజధాని నగరం నిర్మాణం



రైతుల నుంచి పత్రాలు స్వీకరిస్తున్న మంత్రి నారాయణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

దాదాపు ఐదేళ్ల తరువాత రాజధానిలో మరో సారి భూ సమీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో రాజధాని నిర్మాణానికి భూములివ్వని రైతులు తిరిగి ఇప్పుడు ఇస్తున్నారు. దాదాపు 3245 ఎకరాల భూమి సమీకరణలో ఇవ్వకుండా రైతులు అప్పట్లో వెనుకంజ వేశారు. 2015 నుంచి 2019 వరకు 34 వేల ఎకరాల భూమిని 24 వేల మంది రైతుల నుంచి సిఆర్‌డిఏ తీసుకుంది. 2019లో వైసిపి అధికారంలోకి రావడంతో ఈప్రక్రియ నిలిచిపోయింది. 2019 డిసెంబరు 17న అప్పటి వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల నినాదం తెరపైకి రావడంతో అమరావతి నిర్వీర్యమైంది. అమరావతిలో దాదాపు నాలుగున్నర ఏళ్ల పాటు ఎటువంటి కార్యకలాపాలు జరగలేదు. అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయింది. 80 నుంచి 90 శాతం పూర్తయిన నిర్మాణాలను పట్టించుకోలేదు. దీంతో అమరావతితో నిస్తేజం అలుముకుంది. భూముల క్రయ విక్రయాలు కూడా నిలిచిపోయాయి.

2024 జూన్4న టిడిపి అధికారంలోకి రావడంతో మళ్లీ రాజధానికి జీవం వచ్చింది. నిలిచిపోయిన పనుల పూర్తి చేసేందుకు టిడిపి ప్రభుత్వం ప్రయత్నాలు ప్రాంభించింది. దీంతో గ్రామాల్లో తిరిగి లావాదేవీలు ప్రారంభమయ్యాయి. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలు పనికి వస్తాయో లేదో తెలుసుకునేందుకు చెన్నై నుంచి ఐఐటి నిపుణుల బృందాన్ని రప్పించారు. ఈ బృందం ఇటీవల పరిశీలించి

▶ 2లో

బుడమేరు వరదలు గుంటూరుకూ గుణపాఠం

- ముంపు నివారణకు ముందస్తు కార్యాచరణ - డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగిస్తాం - నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం
- ప్రజాశక్తితో గుంటూరు కమిషనర్ పులి శ్రీనివాసులు

▶ 7లో

ఇంటర్వ్యూ

దుమ్ము పడుతోందని ధర్నా

హైవేకు బూడిద తెస్తున్న లారీలను అడ్డుకున్న అపార్ట్‌మెంట్ వాసులు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఎన్నారై మెడికల్ కాలేజీ వెనుక ప్రాంతంలోని సుమారు 10 అపార్ట్మెంట్ వాసులు ఆదివారం సాయంత్రం 5.30 నుండి రాస్తారోకో చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం నుండి చిన్నకాకాని బైపాస్ నిర్మాణం మూడేళ్లుగా జరుగుతోంది. రోడ్డు ఎత్తు కోసం ఇబ్రహీంపట్నం థర్మల్ స్టేషన్ నుండి బూడిదను పెద్ద ట్రక్కుల్లో ఈ ప్రాంతానికి తెస్తున్నారు. వాస్తవానికి హాయ్‌లాండ్ రోడ్డు పక్కన సర్వీస్ రోడ్డు మీదుగా ఈ బూడిదను ట్రక్కుల్లో నిర్మాణ ప్రాంతానికి తీసుకెళ్లాల్సి ఉన్నా ఎన్నారై ముందు రోడ్డు మీదుగా తీసుకెళ్లడం వల్ల ఈ ప్రాంతంలో బూడిదతో నిండిపోతోంది. దీనికితోడు బూడిదను అన్‌లోడ్ చేసిన తర్వాత పైన నీరు సరిగా చల్లకపోవడంతో బూడిద లేచి ఆ ప్రాంతంలోని సుమారు 10 అపార్ట్మెంట్లలో పడుతోంది. దీనివల్ల తాము రోగాల బారిన పడుతున్నామని, రోజుంతా కిటికీలు వేసుకోవాల్సి వస్తోందని అపార్ట్‌మెంట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందులో భాగంగా బూడిద ట్రక్కులను నిలిపేసి రాస్తారోకో చేపట్టారు. నిర్మాణ నిర్వాహకులు వచ్చి తమకు హామీ ఇస్తేగాని విరమించబోమని స్పష్టం చేస్తున్నారు.



ముంపు ప్రాంత భూముల పరిశీలన

ప్రజాశక్తి-తాడేపల్లి

వరద బారిన పడిన ఉండవల్లి మాగాణి భూములను రైతు సంఘం బృందం ఆదివారం పరిశీలించింది. సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ ఉండవల్లిలో మాగాణి ప్రాంతాల్లో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ముంపునకు గురైన ఉండవల్లి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ మోటార్లను తక్షణమే రిపేర్లు చేయాలన్నారు. స్కీమ్‌కు పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే సకాంలో చెల్లించాలని, స్కీమ్‌ను వెంటనే వినియోగంలోకి తెచ్చి పంట పొలాలకు నీరందించాలని కోరారు. అధికారులు వెంటనే ఎన్యుమరేషన్ పూర్తి చేసి ఆయా రైతుల బ్యాంకు ఖాతాల్లో పరిహారం జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె పీరూసాహెబ్, వీరాస్వామి, ఇ.రామారావు, గాంధీ, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్పిటల్లో విగ్రహాలు సరికాదు

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాల ఏర్పాటుకు కూటమి నేతలు సన్నాహాలు చేయటం కొత్త సంస్కృతికి తెరలేపటమేనని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని వైసిపి కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. నరసరావుపేట సమీపంలోని లింగంగుంట్ల ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహం ఏర్పాటు సరైంది కాదన్నారు. రొంపిచర్ల చెరువు కట్ట సెంటర్లో వైయస్సార్ విగ్రహం ఏర్పాటుకు అన్ని అనుమతులూ తీసుకొని ఏర్పాటు చేసినా టిడిపి నాయకులు అనేకమార్లు కోర్టుకెళ్లి అడ్డుకోవాలని చూశారని గుర్తు చేశారు. విగ్రహాల ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని, ప్రభుత్వ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. లింగంగుంట్ల ఏరియా ఆసుపత్రికి కాంగ్రెస్ హయాంలో అప్పటి మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి చొరవతో రూ.20 కోట్ల నాబార్డు నిధులతో అనుమతులు మంజూరైనట్లు తెలిపారు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి 2019 వరకు అసంపూర్తిగా నిర్మాణంలో ఉండగా వైసిపి అధికారంలోకి వచ్చాక రూ 7.50 కోట్లతో సకల వసతులు కల్పించి వైద్య సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు.

అసైన్డ్, పోరంబోకు భూములు సాగు చేస్తున్న ఎస్సీ రైతులకు పట్టాలివ్వాలి : సిపిఎం



ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజలకు అందుబాటులోనే వార్డు సచివాలయాన్ని నిర్వహించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ 21వ వార్డు మహాసభ డి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన కొత్తపేటలో ఆదివారం నిర్వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదిర్శ గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ స్థానిక కబేళ స్థలంలో కమ్యూనిటీ హాలును నిర్మించి ప్రజలు ఉపయోగించుకోవడానికి వీలు కల్పించాలని కోరారు. ఈ మేరకు పలు స్థానిక సమస్యలపై తీర్మానాలను మహాసభ ఆమోదించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, పట్టణ కార్యదర్శి డి.విమల, సీనియర్ నాయకులు అనంత పిచ్చయ్య మాట్లాడారు. అనంతరం నూతన కార్యదర్శిగా పులిపాటి రామారావును తిరిగి ఎన్నుకున్నారు. తొలుత సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఏమినేని శ్రీనివాసరావు, ఎం.హరిపోతురాజు, జె.రాజకుమార్, డి.పుల్లారావు, జి.ఆంజనేయులు, ఎ.ప్రసాద్‌రావు, సిహెచ్.వెంకటరత్నం, ఎ.వెంకటనారాయణ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అసైన్డ్ పోరంబోకు భూములు సాగు చేసుకుంటున్న ఎస్సీ రైతులకు పట్టాలు మంజూరు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఆ పార్టీ రెంటపాళ్ల శాఖ మహాసభ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కామ్రేడ్ వేపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రెంటపాళ్లలో ఆ పార్టీ ఒకటవ, 2వ శాఖ మహాసభలు ఆదివారం జరిగాయి. పలు సమస్యలపై తీర్మానాలను ఆమోదించారు. అన్నదాత సుఖీభవ పథకం విధివిధానాలను వెంటనే ప్రకటించాలని, సామాజిక తరగతులతో సంబంధం లేకుండా ఈ పథకాన్ని కౌల్దార్లందరికీ వర్తింపజేయాలని, ఉపాధి హామీ పనిది నాలు పెంచి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిసి రోడ్లు, పక్కా డ్రెయినేజీ కాల్వలు నిర్మించాలని కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. ఈ సందర్భంగా ఒకటో శాఖ కార్యదర్శిగా జె.భగత్, రెండో శాఖ కార్యదర్శిగా ఎం.నరసింహారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల మండల కార్యదర్శి పి.మహేష్ పాల్గొన్నారు.

భూగర్భ డ్రెయినేజీని నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

సిపిఎం చిలకలూరిపేట రెండో శాఖ మహాసభ బొల్లు శంకర్రావు అధ్యక్షతన స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడారు. పట్టణంలో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని, క్రీడా ప్రాంగణాన్ని నిర్మించాలని, కొత్తగా తాగునీటి పైపులైన్లు వేయాలని, పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేల చట్టం తేవాలని, కౌల్దార్లకు గుర్తింపు కార్డులు, పంట రుణాలివ్వాలని, వ్యవసాయంలో సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేయాలని, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం అందించాలని, మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తీర్మానాలను సమావేశం ఆమోదించింది. నూతన కార్యదర్శిగా జల్లెడ రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సిపిఎం పట్టణ కన్వీనర్ పి.వెంకటేశ్వర్లు, పి.శివగణేష్, ఎవి శివయ్య, పి.భారతి, జి.సావిత్రి పాల్గొన్నారు.



బండ్ల మాధవరావుకు ఆలూరి బైరాగి పురస్కారం

ప్రజాశక్తి - తుళ్లూరు : ప్రముఖ కవి, సంపాదకులు, రాజధాని అమరావతి పరిధిలోని అనంతవరానికి చెందిన బండ్ల మాధవరావుకు కృష్ణాజిల్లా రచయితల సంఘం ఆలూరి బైరాగి స్మారక పురస్కారం - 2024 అందజేయనున్నట్లు కార్యదర్శి డాక్టర్ జీవి పూర్ణచంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 న ఉదయం 10 గంటలకు అవనిగడ్డలో జరగనున్న కృష్ణాజిల్లా రచయితల మహాసభలలో ఈ పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండలి వెంకట కృష్ణారావు వర్ధంతి, 1975 ప్రపంచ తెలుగు మహాసభల స్వర్ణోత్సవాల సందర్భంగా ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ నెలకొల్పిన ఈ పురస్కారాన్ని మాధవరావుకు అందజేయనున్నామని, పురస్కారంలో భాగంగా రూ.10 వేల నగదు, ప్రశంసా పత్రాలను అందజేస్తామని తెలిపారు. మాధవరావు రాసిన 'చెమట, చిత్తడి నేల, స్పర్శ, అనుపమ, మా ఊరు - మా ఇల్లు, ఊరికల, దృశ్య రహస్యాల వెనుక కవితా సంపుటలు ప్రచురించడమే కాక, రైతు కవిత, కవితా వార్షిక సంచికలు, పాపినేని అభినందన సంచిక 'అన్వేషణ', దేవిప్రియ అభినందన సంచిక 'బహుముఖ' తదితర పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. ప్రస్తుతం కవితా! మాసపత్రికకు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు.

లోక్ అదాలత్‌లో 199 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - వినుకొండ : మండల లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి ఎం.మహతి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ప్రాంగనంలో ఆదివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 199 కేసులు రాజీ చేశారు. వీటి వల్ల కక్షిదార్లు రూ.95 లక్షల 64 వేల 561 లబ్ధి పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కెవిఎంఎస్ నాయుడు, లోక్ అదాలత్ మెంబర్ పఠాన్ గౌస్ మొహిద్దీన్ ఖాన్, న్యాయావాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కొల్లా వెంకయ్య వర్ధంతి సభ - లైబ్రరీ ప్రారంభం


ప్రజాశక్తి - పెదనందిపాడు : కొల్లా వెంకయ్య 26వ వర్ధంతి సభ స్థానిక లైబ్రరీ సెంటర్‌లో ఆయన విగ్రహం వద్ద మంగళవారం నిర్వహిస్తామని నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా లైబ్రరీ నూతన భవనాన్ని ప్రారంభిస్తామని, హెచ్‌బిటి రచయిత, సామాజిక కార్యకర్త గీతా రామస్వామి, విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య హాజరవుతారని చెప్పారు.

ఆవోపా ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కేవీ బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ, ఇంజినీర్స్ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ బిల్డర్ మాజేటి ప్రసాద్, ప్రముఖ వ్యాపారి ఎం.రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెలా రూ.500 చొప్పున 108 మందికి పెన్షన్ ఇవ్వడం, దసరా పండుగను పురస్కరించుకొని రూ.వెయ్యి నిత్యావసర వస్తువులను పంపిణీ చేయడం, వైద్య పరీక్షలు, ఉచితంగా మందుల పంపిణీ అభినందనీయమని అన్నారు. రామలింగేశ్వరరావు మాట్లాడుతూ అవోపా ద్వారా విద్య, వైద్య సేవలు అందించడం అందించటం అభినందనీయం అన్నారు. ఇంజినీరింగ్ డే సందర్భంగా ప్రముఖ ఇంజనీర్లు పానకాలు, నారాయణరావు, శివరాంప్రసాద్, మాజేటి ధీరజ్‌ను సన్మానించినారు. ఈ సందర్భంగా ఇంజనీర్ పానకాలు రూ.36 వేలు పెన్షన్ స్కీమ్‌కి విరాళం అందజేశారు. కార్యక్రమంలో కూర్నాల సతీష్, అవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు, మద్ది సాయిరమేష్, వెంకట్రావు, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, చామర్తి రమేష్ పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్-2 ఇరవై వసంతాల వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి : వాకర్స్ క్లబ్-2 అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షతన వాకర్స్‌క్లబ్ తెనాలి-2 ఇరవై వసంతాలు వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ వ్యవస్థాపకులు, సంస్థ ఉపాధ్యక్షులు వైఎల్ నారాయణను సత్కరించారు. క్లబ్ అభివృద్ధికి, కెప్టెన్ విజయ ప్రసాదు మెమోరియల్ ట్రస్టు ద్వారా వివిధ రంగాల్లో నారాయణ చేసిన సేవలను కొనియాడారు. మాజీ అధ్యక్షులు విడిఆర్ మనోహర్, పి.రాజారావు సేవలను గుర్తు చేసుకున్నారు. వారి బాటలోనే వాకర్స్ క్లబ్‌ను నడిపిస్తూ సమాజ సేవకు అంకితభావంతో పని చేస్తామని వేజళ్ల ఉమామహేశ్వర్ తెలిపారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు జి.మురహరిరావు, ఆర్.ఆనందరావు, భుజంగరావు, ఎం.వెంకటసుబ్బారావు, కె.వీరరాఘవయ్య, కె.అందిబాబు, సత్యనారాయణరాజు, జి.నారాయణరావు, ఆర్.సుబ్బారావు పాల్గొన్నారు.



వైయల్ నారాయణను సత్కరిస్తున్న క్లబ్ బృందం

ఐదేళ్ల తర్వాత మళ్లీ భూ సమీకరణ!

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లింది. 2019కి ముందు చేపట్టిన నిర్మాణాలను తిరిగి ఎక్కడ నుంచి ప్రారంభించాలన్న అంశంపై ఈ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటామని మునిసిపల్ మంత్రి నారాయణ ఇప్పటికే ప్రకటించారు. ఈనేపధ్యంలో అమరావతిలో రైతులకు ప్లాట్లు అప్పగించే ప్రక్రియలో భాగంగా గతంలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టారు. రూ.36 కోట్ల అంచనాలతో రూపొందించిన పనులు ఇప్పటికే ఒక కొలిక్కివచ్చాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఈ పనులు నిలిచిపోయాయి. వర్షాలు తగ్గడంతో ఈ పనులు తిరిగి త్వరలో ప్రారంభిస్తామని మంత్రి నారాయణ ఆదివారం మంగళగిరి మండలం ఎర్రబాలెంలో తెలిపారు.

10.37 ఎకరాల భూములు అప్పగింత

మంగళగిరి మండలం ఎర్రబాలెం గ్రామంలో ఇప్పటి వరకు భూ సమీకరణలో ఇవ్వని రైతులు ఆదివారం 10.37 ఎకరాల భూమిని మంత్రి నారాయణ సమక్షంలో అధికారులకు అప్పగించారు. 10 రైతుల నుంచి ఈ భూమి తీసుకున్నారు. మంత్రి నారాయణ నేరుగా రైతుల ఇళ్లకు వెళ్లి ఇందుకు సంబంధించిన పత్రాలను తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ గతంలో పూలింగ్‌కు ఇవ్వని వారు ఇప్పుడిస్తే రైతుల కొరుకున్న చోట ప్లాట్లు ఇస్తామని తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలో వర్షం వలన ముళ్ల చెట్ల తొలగింపు పనులు నిలిచిపోయాయని, మంగళవారం నుండి పనులు పునఃప్రారంభం అవుతాయని చెప్పారు. అమరావతి క్యాపిటల్ సీటీ 29 గ్రామాలలో 217 చదరపు కిలోమీటర్ల పరిధిలో అధునాతన రాజధాని నిర్మాణం చేపడతామన్నారు. అమరావతి రాజధాని క్యాపిటల్ సీటీ సిఆర్‌డిఎ పరిధి 29 గ్రామాల్లో 217 చదరపు కిలో మీటర్ల పరిధిలో 58,000 వేల ఎకరాలకు గానూ, 34 వేల ఎకరాల రైతులు పూలింగ్‌కు ఇచ్చారని, మిగిలినవి ప్రభుత్వ భూములుకాగా, అక్కడక్కడ అయా గ్రామాల్లో సుమారుగా 10, 15 ఎకరాలు పూలింగ్‌కు ఇవ్వలేదని, వాటిని కూడా రైతుల వద్ద నుండి స్వచ్ఛందంగా తీసుకుంటామని నారాయణ అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి ఎ.జయసత్య, టిడిపి నాయకులు ఎ.ఉమామహేశ్వరరావు, ఎం.వెంకట్రావు, ఎన్.జాక్సన్, రంగారావు పాల్గొన్నారు.

30న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా



మాట్లాడుతున్న దయా రమాదేవి, వేదికపైన వై నేతాజీ, దండా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 30 కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా విస్తృత సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఆదివారం పాత గుంటూరులోని సిఐటియు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాదిమంది కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, డైలీ వేజ్, అసైన్మెంట్ పేర్లతో పనిచేస్తున్న ఉద్యోగులు కనీస వేతనాలు లేకుండా వెట్టిచాకిరీ చేస్తున్నారని అన్నారు. వారంతా సమస్యల పరిష్కారానికి ఏకతాటిపైకి రావాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావట్లేదన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో శాశ్వత స్వభావం కలిగిన ఉద్యోగాల్లో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానంలో నియామకాలు చేపట్టి, వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని అన్నారు. ప్రైవేట్ రంగంలో అసైన్మెంట్ పేరుతో యాజమాన్యాలు కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో పనిచేసే కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేసి, పోరాటాలకు సిద్ధం చేస్తున్నట్లు నేతాజి చెప్పారు. అదేవిధంగా శ్రామిక మహిళల సమస్యలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ కార్యాలయాల్లో, సంస్థల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పించాలని అన్నారు. తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్మిక శాఖ అధికారులు, ఫ్యాక్టరీ అధికారులు సౌకర్యాలపై నిఘా ఉంచి కార్మికులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణరావు, హుస్సేన్‌వలి, రమేష్, వి దుర్గారావు ఏ.వి. ఎన్. కుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జొన్నా శివశంకరరావు

ప్రజా పోరాట యోధుడు ఏచూరి

ప్రజాశక్తి-తాడేపల్లి

జాతీయ, అంతర్జాతీయ సమస్యలతో పాటు దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన సీతారాం ఏచూరి ధన్యజీవి అని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్నా శివశంకరరావు ఘనంగా నివాళులర్పించారు. ఆదివారం ఉండవల్లి గ్రామంలోని సుందరయ్య చౌక్ వద్ద సిపిఎం అఖిలభారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు కె.ఈశ్వరరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జొన్నా శివశంకరరావు మాట్లాడుతు ఏచూరి లేని లోటు ప్రజాతంత్ర ఉద్యమాలకు, లౌకికశక్తులను తీరని లోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం రాజధాని డివిజన్ అధ్యక్షులు కె.జగదీశ్వరరెడ్డి రైతు సంఘం రాజధాని కార్యదర్శి శ్రీనివాసరావు, ఈమని రామారావు, దాసరి సోమయ్య, గుంటక శ్రీనివాసరెడ్డి, వీరాస్వామి, గాంధీ, పీరూసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : సిపిఎం తెనాలి ఏరియా కమిటి ఆధ్వర్యంలో తెనాలి మండలం కంచర్లపాలెంలో ఆదివారం సీతారాం ఏచూరి సంతాప సభ స్థానిక నాయకులు కోపల్లె సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో సిపిఎం తెనాలి ఏరియా కమిటి కార్యదర్శి కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ ఏచూరి పార్టీ ప్రధాన కార్యదర్శిగా సెక్యులరిజం కోసం దేశ ఐక్యత కోసం, విచ్ఛిన్నకర వేర్పాటు శక్తులను ఎదుర్కోటం కోసం కృషి చేశారని చెప్పారు. కార్యక్రమంలో ఏపి రైతు సంఘం ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి కె సీతారామయ్య, సిహెచ్ శేషగిరి రావు, పి కృష్ణ, కె కష్ణ, జి నేతాజీ పాల్గొన్నారు. ముందుగా ఏచూరి చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

4 వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని వైఎస్సార్ సెంటర్‌లో వినాయక ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆది వారం నాలుగు వేల మందికి అన్నదానం నిర్వ హించారు. 25 కిలోల లడ్డు వేలం పాటలో రూ.2.70 వేలకు భాస్కం రెడ్డి, పది కిలోల లడ్డును రూ.75,770కు ఈమని శివారెడ్డి, వినాయక మణిహారాన్ని రూ.1.15 లక్షలకు గుంటక శ్రీనివాసరెడ్డి దక్కించుకున్నారు. కార్యక్రమంలో బుర్రముక్కు వేణుగోపాలసోమిరెడ్డి, కళ్లం రాజశేఖరరెడ్డి, మందాపు శ్రీనివాసరెడ్డి, మేకా శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లి అపర్ణ వన్ అపార్టుమెంట్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రెండు వేల మందికి అన్నదానం నిర్వహించారు. లడ్డు వేలం పాటలో రూ.4.59 లక్షలకు ఫార్చ్యూన్ గ్రూప్ ఎమ్‌డి కొండా ప్రతాప్‌రెడ్డి దక్కించుకున్నారు.

తెలుగు బాప్టిస్ట్ సంఘం వితరణ

వరద బాధితులకు నిత్యావసర కిట్లు అందజేత

ప్రజాశక్తి-గుంటూరు :విజయవాడ వరద బాధితులకు నిత్యావసర సరుకులతో కూడిన కిట్స్ అందించిన గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యులకు గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అభినం దించారు. ఆదివారం స్థానిక కన్నావారి తోటలోని గుంటూరు తెలుగు బాప్టిస్ట్ సంఘం సభ్యులు విజయవాడ సింగ్ నగర్‌లో వరద బాధితులకు అందించనున్న 400 నిత్యవసర సరుకుల కిట్స్ వాహనాన్ని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. బియ్యం, కందిపప్పు, నూనె, వంటి 7 రకాల నిత్యావసర సరుకులతో కూడిన షుమారు రూ.4లక్షల విలువైన కిట్స్ అందించారు. కార్యక్రమంలో సీనియర్ సంఘ కాపరి రెవ.యం.గాబ్రియేలు, అసోసియేట్ పాస్టర్ టి.ఈనక్ జార్జ్, వెట్కస్ ఛైర్మన్ యం.ధర్మారావు, సెక్రటరీ సిహెచ్.రవివర్మ పాల్గొన్నారు.


నాగేశ్వరరావు, భీమేశ్వర ప్రసాద్‌ను సత్కరిస్తున్న రావి రంగారావు తదితరులు

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆరుద్ర

ప్రజాశక్తి-గుంటూరు :ఆరుద్ర బహుముఖ ప్రజ్ఞాశాలి అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముప్పాళ్ళ వెంకటశివ ప్రసాదరావు అన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని సర్వీసు హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో 'అమరావతి సాహితీ మిత్రులు' నిర్వహించిన సాహిత్య సభలో ఆయన ఆరుద్ర సాహిత్యం గురించి ప్రసంగించారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు అధ్యక్షత వహించిన సభలో వెంకటశివ ప్రసాదరావు మాట్లాడుతూ ఆరుద్రకు కవిత్వం, డిటెక్టివ్ నవలలు, నాటికలు, పరిశోధనలు, చదరంగం, ఇంద్రజాలం మొదలైన వివిధ అంశాలలో ప్రవేశం ఉందన్నారు. త్వమేవాహం, సినీ వాలి, సమగ్ర ఆంధ్ర సాహిత్య చరిత్ర, ' కొండగాలి తిరిగింది' సినిమా పాటల సంపుటి అందరూ చదివి తీరాలని సూచించారు. 'ఈ మాసం కవి' గా ఆళ్ల నాగేశ్వరరావు (తెనాలి) పాల్గొని కవితలు వినిపించారు. పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో పూసపాటి కృష్ణ సూర్యకుమార్, చల్లా సత్యవతి, గడల శివప్రసాద్, శరణం కనక దుర్గ, యర్రగుంట్ల పాణిరావు, మేడిసెట్టి సుభద్రా కష్ణ, కొప్పరాజు విజయ సారథిబాబు తదితరుల పాల్గొన్నారు. 'ఈ మాసం కవి' నాగేశ్వరరావును, 'నిక్కచ్చి కవిత' పోటీ విజేత విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్ రావిరంగారావు, డాక్టర్ టి.సేవాకుమార్, డాక్టర్ ముప్పాళ్ళ, శాంతా ట్యుటోరియల్ కళాశాల శ్రీమన్నారాయణ ఘనంగా సత్కరించారు.

విజ్ఞాన్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు :వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో ఆదివారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విజ్ఞాన్స్ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు యూనివర్సిటీ విధివిధానాలు, కల్చర్ గురించి పూర్తిగా అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ అధ్యాపకుల దగ్గరనుంచి విసి వరకూ అందరూ అందుబాటులో ఉంటా రని, మీకేమైనా ఇబ్బం దులు తలెత్తితే మమ్మల్ని నేరుగా సంప్ర దించవచ్చునని పేర్కొన్నారు. విద్యార్థులు కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునే దిశగా సాగాలని, వైఫల్యాలను సైతం విజయానికి సోపానంగా మార్చుకోవాలని, సాహసాలు చేయడానికి ఎప్పుడూ వెనుకాడ కూడదని అప్పుడే గొప్ప విజయాలు సిద్ధిస్తాయన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - యడ్లపాడు

తిమ్మాపురం జాతీయరహదారి వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని సంఘటన స్థలంలో ఒకరు, వైద్యశాలలో ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా నిడమర్రుకి చెందిన డ్రైవర్లు కృష్ణ, రవికిషోర్ కాకినాడ వెళ్లి వస్తున్న క్రమంలో తిమ్మాపురం వద్ద కారు పంచర్ పడింది. కారుకు పంచరు వేసుకుంటున్న సమయంలో గుర్తుతెలియన వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కృష్ణ అక్కడికక్కడే మృతి చెందగా, చిలకలూరిపేట ఆస్పత్రిలో పరిస్థితి విషమించి రవికిషోర్ మృతి చెందాడని పోలీసులు తెలిపారు. ఎస్ఐ వి బాలకృష్ణ మాట్లాడుతు సిసి కెమెరాలు పరిశీలిస్తున్నామని, కేసు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

సొంతిల్లున్నా ఉండలేక!

మాచర్ల-హైదరాబాద్ హైవే రోడ్డు పక్కన ఇందిరమ్మ కాలనీలో 15 ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యం వలన మౌలిక వసతులు వనగూరలేదు. ఎటు చూసినా ముళ్ల కంప చెట్లు పెరిగాయి. దీంతో ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారు కూడా మధ్యలో ఆపేశారు. ఇప్పుడు ఆ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకోవడంతో దయ్యాల కాలనీగా పేరుతెచ్చుకుంది. అయినా రెక్కల కష్టంతో రూపాయి రూపాయి కూడబెట్టుకుని కట్టుకున్న ఇళ్లను వదిలి వెళ్లలేని వారు దుర్భర పరిస్థితుల్లో భయంభయంగా బతుకుతున్నారు.



- ఘోస్టు కాలనీగా ఇందిరమ్మ కాలనీ
- దుర్భర పరిస్థితుల మధ్య జనజీవనం
- 15 ఏళ్ల క్రితం ఏర్పడ్డ కాలనీలో మౌలిక వసతుల లేమి
- భయంతో సొంతిళ్లు వదిలేసి అద్దె ఇళ్లకు నివాసితులు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ కాలనీలో మాచర్ల పట్టణంలోని 274 పేద కుటుంబాలకు ఇంటి పట్టాలు రాగా 100 కుటుంబాలు ఇళ్ల నిర్మించుకున్నాయి. 50 ఇళ్ల సగం వరకు పూర్తయ్యాయి. నిర్మాణం పూర్తిచేసుకున్న 100 ఇళ్లల్లో 50 కుటుంబాల వరకు నివాసం ఉంటున్నారు. కాలనీ ఏర్పడ్డ చాలా కాలం తరువాత విద్యుత్ లైను వేసినా వీధి దీపాలు అమర్చలేదు. కొన్ని విద్యుత్ స్తంభాలు ఒరిగి పడిపోవటానికి సిద్ధంగా వున్నాయి. కాలనీలోని ఉన్న ఏడు రోడ్లూ మట్టి రోడ్లే. ఉప్పు నీటితో ఇబ్బందులు, తాగునీటి కోసం రెండు కిలోమీటర్లు వెళ్లాలి. చినుకు పడితే రోడ్లు బురద, గుంతల మయంగా మారే రోడ్లపై నడవలేని పరిస్థితి. డ్రెయినేజీ కాల్వలు లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు ఇంటి ముందు, పక్కనే నిలిచే దుస్థితి.

కాలనీ మొత్తం పిచ్చి కంప చెట్లు పెరిగాయి. రోడ్లపై కూడా కంప చెట్లు పెరటంతో పగలే పాములు, తేళ్ల తిరుగుతూ భయపెడుతున్నాయి. రాత్రుళ్లయితే అడుగు బయట పెట్టాలంటే భయం. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఉండలేక కొందరు ఇళ్లు వదిలి మరో ప్రాంతంలో అద్దె ఇళ్లల్లో ఉంటుండగా మరికొందరు నిర్మాణంలో ఇళ్లను అంతే వదిలేశారు. మరికొందరు నిర్మాణానికే సాహసించడం లేదు. ఇక్కడి సమస్యలను ఎన్నో మార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని కాలనీ వాసులు వాపోతున్నారు. హైదరాబాద్ హైవే రోడ్డు పక్కనే ఉన్న కాలనీకి పక్కన ప్రైవేటు హౌసింగ్ వెంచర్లు కూడా వచ్చాయని, మౌలిక వసతులు కల్పిస్తే కాలనీ మొత్తం ఇళు ఏర్పడి అభివృద్ధి చెందుతుందని అంటున్నారు. కాలనీ ఏర్పడ్డాక మూడు ప్రభుత్వాలు మారినా తమ గోడు విన్నవారు లేరని నిట్టూరుస్తున్నారు. 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కూడా సమస్యలు తీర్చలేదని, ప్రస్తుత ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అయినా కాలనీలో మౌళిక వసతలు కల్పించాలని కోరుతున్నారు.





రాత్రి అయితే భయం : షేక్ బీబీ



రాత్రయితే చాలు కాలనీ మొత్తం కటిక చీకటి మయంగా మారి భయం పుడుతుంది. లైట్లు లేవు. మేమే సొంతగా ఇంటి ముందు వున్న స్తంభానికి లైటు ఏర్పాటు చేస్తే అది కూడా కొద్ది రోజుల నుండి వెలగటం లేదు.

ఇళ్లముందే మురుగునీరు : యడ్లపల్లి సుబ్బమ్మ



వానొస్తే చాలు ఈ గుంతలు రోడ్లు మొత్తం బురదగా మారుతుంది. నడుస్తూ జారిపడ్డ సందర్భాలెన్నో. సైడు కాల్వలు లేకపోవటంతో మురుగునీరు మొత్తం ఇళ్ల ముందే నిలబదుతోంది. సిమెంటు రోడ్లు, సైడు కాల్వలతోపాటు ముళ్ల కంప చెట్లను తొలగించాలి.

నీటి కోసం రెండు కిలోమీటర్లు : మహంకాళి శ్రీను



కాలనీలోని బోర్లలో ఉప్పునీరు వస్తోంది. తాగునీరు కావాలంటే రెండు కిలోమీటర్లు వెళ్లాలి. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా తాగునీటిని సరఫరా చేయాలి.



ఉద్యమాల వేగుచుక్క సీతారాం ఏచూరి


ప్రజాశక్తి - పెదకూరపాడు

భారతదేశ ఉద్యమాలకు వేగుచుక్క సీతారాం ఎచూరి అని క్రోసూరు మార్కెట్ మాజీ చైర్మన్ బి.రాంగోపాల్రావు, రైతు సంఘం జిల్లా సహయ కార్యదర్శి డి.శేషారావు అన్నారు. స్థానిక కచేరి సెంటర్లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. పార్లమెంటు లోపల, బయట ప్రజల కోసం పోరాడిన నిబద్ధతగల యోధుడ సీతారాం అని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా పి చేస్తామని చెప్పారు. నివాళు లర్పించిన వారిలో కె.అప్పారావు, విశ్రాంత హెచ్ఎం జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, వి.రామనాథం, కె.సాంబశివరావు, ఎం.మస్తాన్‌రావు ఉన్నారు.



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని నార్నెపాడులోని సిపిఎం పార్టీ కార్యాలయంలో సీతారాం ఏచూరి సంతాప సభ జరిగింది. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఏచూరి చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ప్రపంచంలోనే గొప్ప కమ్యూనిస్టు నాయకుల్లో ఏచూరి ఒకరని చెప్పారు. ఆయన మరణం దేశ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. నాయకులు ఎన్.సాంబశివరావు, కె.ప్రభాకర్, ఐ.శ్రీను, ఐ.సాంబశివరావు, టి.మస్తాన్‌రావు, డి.అప్పారావు, వాసు, చందు మాస్టారు పాల్గొన్నారు.



విశ్వేశ్వరయ్యకు ఇంజినీర్ల నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

స్థానిక లైసెన్స్ సర్వేయర్స్ అండ్ ఇంజినీర్స్ అసోసియేషన్ హాల్లో ఇంజినీర్స్‌డేను ఆదివారం నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆర్కిటెక్ట్ జె.జబ్బార్, ఇంజినీర్లు చంద్ర, శ్రీనివాస్, మధు, న్యాయవాది భాను ప్రసాద్, సాదిక్, షరీఫ్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి డీఎస్పీగా హనుమంతరావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

డీఎస్పీ జి.గుర్నాథ్‌బాబు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఎం.హనుమంతరావును నియమిస్తూ డీజీపీ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. హనుమంత రావు ఇప్పటి వరకూ పోలీస్ కంట్రోల్ సర్వీస్‌లో పనిచేశారు. గుర్నాథ్‌బాబును పోలీస్ హెడ్‌క్వార్టర్‌కు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్ లో స్పందన రద్దు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లా కలెక్టరేట్లో నేడు నిర్వహించాల్సిన గ్రీవెన్స్‌ను మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని అధికారిక సెలవుదినం కావడంతో రద్దు చేసినట్లు కలెక్టరేట్ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటన జారీ చేసింది.

లగడపాడులో డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - పెదకూరపాడు



మండలంలోని లగడపాడులో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులపై సత్తెనపల్లి డిఎస్‌పి రఘునాథ్‌బాబు ఆదివారం విచారణ చేశారు. వినాయక చవితి సందర్భంగా గ్రామంలో ఘర్షణలు జరిగాయి. ఇరు పక్షాలపై కేసులు నమోదైన నేపథ్యంలో గ్రామాన్ని ఎస్సై బాలునాయక్‌తో కలిసి డీఎస్పీ సందర్శించి ఇరుపక్షాల నుండి వివరాలు తెలుసుకున్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు, సాంస్కృతిక నైపుణ్యాలు అవసరం

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటలు, సాంస్కృతిక పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధ్యాయులు అంతర్గతంగా ఉన్న సామర్థ్యాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా స్వర్ణోత్సవాలలో భాగంగా ఆదివారం గుంటూరులో ఆటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. స్థానిక పిచ్చుకల గుంట, బి.ఆర్ స్టేడియంలో ఆటల పోటీలు నిర్వహించారు. అలాగే యుటిఎఫ్ కార్యాల యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీలను యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యుటిఎఫ్ నిత్యం ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడటంతోపాటు, ఇటువంటి ఆటవిడుపు కార్యక్రమాల ద్వారా ఉపాధ్యాయుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసే ప్రయత్నం చేస్తుందని చెప్పారు. ఈ పోటీల్లో గెలుపొందే వారికి 2024 డిసెంబర్‌లో జరిగే స్వర్ణోత్సవ వేడుకలలో బహు మతులు అందజేస్తామన్నారు.



రన్నింగ్ , క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటున్న ఉపాధ్యాయులు





మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఎఎన్.కుసుమకుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బోధనకే పరిమితం కాకుండా విద్యార్థిలో ఆల్‌రౌండ్ డెవలప్మెంట్ పెంపొందించాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఎందరో అమరుల త్యాగాల ఫలితంగా యుటిఎఫ్ ఆవిర్భవించిందని గుంటూరు జిల్లాలో అమరులైన రాయన్న, గౌస్, మల్లేశ్వరరావు, పౌలురాజు లాంటి త్యాగధనుల స్ఫూర్తితో భవిష్యత్‌లో విద్యారంగ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ యుటిఎఫ్ విద్యా రంగంతో పాటు సామజిక స్పృహతో పనిచేస్తుందని, ప్రకతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు, కరోనా సందర్భంలోనూ, ఇటీవల వరదల సందర్భంగా ప్రజలకు అండగా నిలిచి అనేక సేవా కార్యక్రమాలు చేసిన ఏకైక సంఘం యుటిఎఫ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా సహధ్యక్షురాలు ఏఎల్. శివపార్వతి, జిల్లా కోశాధికారి ఎండి.దౌలా, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వర్లు, యు.రాజశేఖర్‌రావు, యం.గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విజయం ముఖ్యం

మోక్షగుండం విశ్వేశ్వరయ్యకు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

జీవితంలో ప్రతి విద్యార్థి విలువలతో కూడిన విజయం సాధించడం ముఖ్యమని కర్ణాటక టుంకూర్‌లోని సీవోపీపీఆర్ఆర్ఓడీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెచ్‌జీ చంద్రశేఖర్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కలేజీల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ప్రఖ్యాత ఇంజినీరు, భారతరత్న అవార్డు గ్రహీత మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఇంజినీర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హెచ్‌జీ చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్, అభివృద్ధి మొత్తం యువత మీదే ఆధారపడి ఉందని, సరికొత్త ఆవిష్కరణలకు పూనుకోవాలన్నారు. ప్రయోగాలపై దృష్టి సారించి, సమాజంలోని సమస్యలకు పరిష్కా రాలు కనుగొనాలని సూచించారు. కర్ణాటకలోని టుంకూర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థుల ఒదరూ సరికొత్త ఆవిష్కరణలతో ముందుకు రావాలని కోరారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులందరూ ముందుగా సమాజంలో ఉన్న సమస్యలను గుర్తించాలని, ఆ తర్వాత సమస్యను ఏవిధంగా పరిష్కరించగలమో ఆలోచించాలన్నారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్‌చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు మాట్లా డుతూ విద్యార్థులందరూ మోక్షగుండం విశ్వేశ్వర య్యలా రోజుకు 16 గంటలు కష్టపడాలన్నారు. వీసీ ప్రొఫెసర్ పీ.నాగ భూషణ్ మాట్లాడుతూ దేశ అభివద్ధిలో ఇంజినీర్ల పాత్ర ఎంతో కీలక మని చెప్పారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, విజ్ఞాన్ లారా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్ర కుమార్, ఆయా విభాగాల డీన్లు పాల్గొన్నారు.



మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న చంద్రశేఖర్ తదితరులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు, ఎమ్మెల్యే మాధవి తదితరులు

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక కలెక్టరేట్ ఆవరణలోని రెవెన్యూ కళ్యాణ మండపంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రజక ఉద్యోగుల రాష్ట్ర ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గళ్లా మాధవి, విశాఖ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రజక ఉద్యోగులందరికీ ఒక సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. సదస్సులో పంచాయితీరాజ్ సూపరింటెండింగ్ ఇంజినీర్ జి.బ్రహ్మయ్య, ఎపిఎన్‌జిఒ మాజీ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు ప్రసంగించారు. అసోసియేషన్ అడహాక్ కమిటీ నాయకులు కాకర్ల రాము, సత్యనారాయణ, దుర్గాప్రసాద్, పాపారావు, మల్లిఖార్జున్ సదస్సును పర్యవేక్షించగా 26 జిల్లాల నుండి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తొలుత వీరనారి ఐలమ్మ, మాచెలా మాడెలా, సంత్‌గాడ్ కె.బాబాకు పూలమాల వేసి నివాళి అర్పించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని శాఖా మహాసభల్లో తీర్మానాలు

ప్రజాశక్తి పెదనందిపాడు రూరల్

పెదనందిపాడు మండలంలోని ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని, నల్లమడవాగు ఆధునీకరణ,కట్టమీద నివాసులకు ఇళ్లస్థలాల కేటాయింపు, డ్రైనేజీ సమస్య, అసంఘటిత రంగ కార్మికులను కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర తీర్మానాలకు మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివారం పెదనందిపాడు తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం పెదనంది పాడు శాఖ మహాసభ కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. తొలుత సిపిఎం పార్టీ జెండాను జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఆవిష్కరించారు. అనంతరం ఈనెల 12వ తారీకు మరణించిన సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి ఈమని అప్పారావు, తేళ్ల నారాయణ చిత్రపటానికి జంపని రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఈ మహాసభను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ గుంటూరు ఛానల్ పొడిగింపునకు అవసరమైన నిధులు వెంటనే కేటాయించి పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.నల్లమడ వాగు ఆధునీకరణ పనులు వెంటనే చేపట్టాలని కోరారు.మండలంలో అన్ని పంట కాలువలు డొంక రోడ్లు బాగు చేయాలని కోరారు. జిల్లావ్యాప్తంగా వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, వరదల్లో దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభలో మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు పలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. అనం తరం పెదనందిపాడు శాఖ నూతన కార్యదర్శిగా దొప్పలపూడి రమేష్ బాబు, సహాయ కార్యదర్శిగా కొత్త వెంకట శివరావులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మహాసభలో శాఖ సభ్యులు జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాస రావు, చుక్క యానాదులు, కాపు వెంకట సుబ్బారావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, షేక్ షమీ, పటాన్ సలీం, అన్నలదాసు ఆశీర్వాదం పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లిలోని ముగ్గురోడ్డు, వివిధ ప్రాంతాల్లో రైల్వే స్థలాల్లో నివశిస్తున్న పేదలకు ప్రభుత్వం పట్టాలివ్వాలని సిపిఎం ముగ్గురోడ్డు శాఖ తీర్మానించింది. ఆదివారం శాఖ మహాసభ మన్నెం లీలమ్మ అధ్యక్షతన స్థానిక కార్యాలయంలో జరిగింది. ఎన్నికలకు ముందు పాదయాత్ర సందర్భంగా లోకేష్ తాడేపల్లి వచ్చిన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని తీర్మానించారు. అలాగే టిడిపి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరారు. పోలకంపాడు నుంచి టిటి యార్డు వరకు డ్రైన్ నిర్మాణం చేపట్టాలని మహాసభ కోరింది. మహాసభ కార్యదర్శి దర్శనపు విజయబాబు, సహాయ కార్యదర్శిగా యనమాల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భ ంగా సిపిఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కార్యదర్శి వర్గ సభ్యులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, గాదె సుబ్బారెడ్డి మాట్లాడుతూ సిపిఎం విశిష్టతను తెలియజేశారు. ముందుగా సిపిఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. మహాసభ సందర్భంగా ముగ్గురోడ్డులోని సిపిఎం జెండాను శ్రీనివాసకుమారి ఆవిష్కరించారు.

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక 41వ డివిజన్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌లో సిపియం శాఖ మహాసభ ఆదివారం సిహెచ్.హరిబాబు స్మారక భవన్‌లో షేక్.మస్తాన్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. మహాసభలో తొలుత సిపియం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పశ్చిమ బెంగాల్ మాజీ సిఎం బుద్దదేవ్ భట్టాచార్య తదితరులకు సంతాపం తెలియజేశారు. సిపియం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని స్వర్ణభారతి నగర్, సుందరయ్య నగర్, రామాంజనేయ కాలనీ, తదితర కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, ఇన్నర్ రింగ్ రోడ్ మూడో దశ నిర్మాణం చేపట్టాలని, పేదల ఇళ్లకు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సభ్యులు గోనె లూదర్‌పాల్‌ను శాఖ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.మహాసభలో సిపియం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.ముత్యాలరావు, నగర కమిటీ సభ్యులు బి.సత్యనారాయణ, షేక్.ఖాసిం షహీద్, సభ్యులు ఎస్.పద్మనాభుడు, కె.ఆంజనేయులు, అలమోతు సుకన్య, నాయుడు పద్మ పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న పాశం రామారావు



గణేష్ నిమజ్జనంలో ట్రాక్టర్ నడిపిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి తన స్వగ్రామమైన రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వగ్రామంలో వైసిపి నాయకులు గ్రామస్తులు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి కి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో భాగంగా ఆయన వినాయక ఊరేగింపు వాహనాన్ని నడిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రొంపిచర్ల మండలం వైఎస్ఆర్సిపి కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాస్ రెడ్డి , మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పచ్చవ రవి మరియు బత్తుల రామకష్ణ, దీరం భాస్కర్ రెడ్డి, మరియు బుచ్చిపాపన్న పాలెం గ్రామ నాయకులు, వినాయక విగ్రహ కమిటీ సభ్యులు,పలు గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఈనెల 16న మాచర్ల తహశీల్దారు కార్యాలయంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు తహసిల్దార్ ఎండి జియావుల్ హక్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం సెలవు ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా కలెక్టరేట్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నీ జిల్లా కలెక్టర్ రద్దు చేశారని తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

ప్రజాశక్తి- మాచర్ల

మాచర్ల చుట్టు పక్కల గ్రామాల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు తొమ్మిదవ రోజైనా ఆదివారంనాడు పెద్ద ఎత్తున నిమజ్జనాలకు తరలివెళ్లాయి. డీజె సౌండ్స్ పాటలు, నత్యాల మధ్య వినాయక విగ్రహాలను ఊరేగించారు. విగ్రహాల ఊరేగింపుతో పట్టణంలో సందడి ఏర్పడింది. బాణాసంచా కాల్చుతూ ఉత్సాహంగా ఊరేగింపు జరిపారు. అనంతరం తాళ్ళపల్లి, జమ్మలమడక రహదారిలోని నాగార్జునసాగర్ కుడి కాల్వలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఆదివారం రోజు కావటంతో నిమజ్జన కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున చిన్నాపెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

మాచర్ల పట్టణంలో పరిసర గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాల్లో అధిక శాతం విగ్రహాలు ఆదివారం నిమజ్జనాలకు కదిలాయి. దీంతో ప్రత్యేక పోలీసు బలగాలు పట్టణానికి వచ్చాయి. నిమజ్జనం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటణలు జరగకుండా గత అనుభవాలను దృష్ట్యా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



వేడుకగా యుటిఎఫ్ స్వర్ణోత్సవ క్రీడా సంబరాలు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాలలో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గ స్థాయి రెండు రోజుల క్రీడా సంబరాలను ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో మొదటి రోజు స్థానిక శ్రీసాధినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్లో ఆదివారం నిర్వహించారు. ఈ క్రీడా సంబరాలకు సాదినేని చౌదరయ్య స్కూల్ డైరెక్టర్ ప్రభాకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా వచ్చిన యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రన్నింగ్, కాటన్స్, చెస్, టెన్నికాయిట్ క్రీడలను నిర్వహించామన్నారు. 16వ తేదీనా షటిల్, బ్యాట్మెంటన్ పోటీలను చౌదరయ్య క్లబ్లో నిర్వహిస్తామన్నారు. రెండు రోజులు జరిగే ఆటల పోటీలకు న్యాయా నిర్ణేతలుగా వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్కె.అచ్చేమియా, ఎస్కె.ఖాదర్ మస్తాన్, ఎస్కె.ఇస్మాయిల్, కెవి.నాగరాజు, నాగమణి తదితరులు న్యాయ నిర్ణయితులుగా వ్యవహరిస్తారన్నారు. జిల్లా కార్యదర్శి కె.తిరుపతి స్వామి ప్రాంతీయ శాఖల ప్రధాన బాధ్యులు డి.సుధాకర్ హరి ప్రసాద్, ఎస్కెఎం డి.యాసిన్, కె.స్నేహలత, కె.అరుణ, కె.చంద్రశేఖర్ ఆర్.రోశయ్య, జి.అర్ల రెడ్డి, జే.పార్ధసారథి, బిట్రా నాగేశ్వరరావు, వెంకటస్వామి, విజయ ఆదిలక్ష్మి ఈ పోటీలను పర్యవేక్షించారన్నారు. ఈ క్రీడల్లో మూడు మండలాల ఉపాధ్యాయునీఉపాధ్యాయులు సుమారుగా 60మంది పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి క్రీడలను ప్రారంభిస్తున్న దృశ్యం



క్రీడల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉపాధ్యాయులు

బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యతనివ్వాలి



ప్రజాశక్తి- మాచర్ల

రాష్ట్రప్రభుత్వం త్వరలో ప్రవేశపెడుతున్నా 2024-25 వార్షిక బడ్జెట్లో ఎస్సీ, ఎస్టీ సబ్ప్లాన్ నిధుల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని దళిత బహుజన సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్లు వెల్దుర్తిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జూలకంటి బ్రహ్మానంద రెడ్డిని కలసి ప్రతిపాదనల మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కుక్కమూడి ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ విదేశీ విద్యా విధాన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ పిల్లలను ఎక్కువ మందిని విదేశీ చదువులకు పంపించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో పిహెచ్డి చదువుతున్న ఎస్సీ ఎస్టీ రీసెర్చ్ స్కాలర్స్కి ఉపకార వేతనం పథకాన్ని ప్రవేశపెట్టి కనీసం నెలకి రూ.30 వేలు, అంబేద్కర్ రీసెర్చ్ ఫెలోషిప్ పేరుతో ఇవ్వాలని డిమాండు చేశారు. ఇవన్నీ ఈ బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడాలని కోరారు. భూమి కొనుగోలు పథకానికి 500 కోట్లు బడ్జెట్లో నిధులు కేటాయించి ప్రభుత్వమే భూమిని కొని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఇవ్వాలన్నారు. ప్రతి ఎస్సీ ఎస్టీ కాలనీలలోనూ అంబేద్కర్ విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేసి అక్కడ లైబ్రరీలు ఏర్పాటు చేయాలని ఇంకా పలు అంశాలపై ఎమ్మెల్యేకి విన్నవించారు. స్పందించిన మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ గతంలో ఆపేసిన ప్రభుత్వ సంక్షేమ పథకాలు మొత్తం తిరిగి ప్రారంభించే విధంగా ప్రభుత్వం చూస్తుందని, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి కోసం ప్రభుత్వ పథకాలు రూపొందిస్తుందని, ఎస్సీ కార్పొరేషన్లో ఎన్ఎస్ఎఫ్డిసి, ఎన్ఎస్కెఎఫ్డిసి, ఎన్ఎస్ఎఫ్టిసి పథకాలు తిరిగి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని అన్నారు. 24 ఎస్సీ, ఎస్టీ ప్రతిపాదనలను వచ్చే బడ్జెట్ సమావేశాల్లో మాట్లాడతామని అన్నారు. ఎమ్మెల్యేకి మెమోరాండం ఇచ్చిన వారిలో బాబుజగ్జీవన్ రావ్, చర్మకారుల సంక్షేమ సంఘం మాచర్ల టౌన్ అధ్యక్షులు కందుల రవి, టిడిపి పల్నాడు జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి ఆదిరాల ప్రసాద్, ముటుకూరు జిల్లా పరిషత్ పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ కుక్కమూడి మరియదాసు, దళిత నాయకులు కే.సాగర్, మంద రాజేష్, కే.నాగరాజు, ఐ.సాగర్ ఉన్నారు.

హెచ్ఎం దుర్గాభవానికి జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

మాచర్ల మండలం ఎత్తిపోతల లోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాల హెచ్ఎం జి.దుర్గాభవాని,ఉపాధ్యాయురాలు ఆర్.నాగమల్లేశ్వరి లకు జాతీయ పురస్కారం లభించింది.తిరుపతిలో కలాం విజన్,యువతేజం ట్రస్టు ఆధ్వర్యంలో విశ్వం కళాశాలలో ఆచార్య దేవోభవా జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.అవార్డులను డాక్టర్ సర్వేపల్లి



రాధాకృష్ణన్ మనువడు డాక్టర్ సుబ్రహ్మణ్యం శర్మ ,ద్రావిడ విశ్వావిద్యాలయం మాజీ వీసీ కనకాల రత్తయ్య,యువ తేజం చైర్మన్ కరీముల్లా చేతుల మీదుగా ఉపాధ్యాయులు అందుకున్నారు.జాతీయ పురస్కారాలు పొందిన హెచ్ ఎం దుర్గా భవాని,నాగమల్లేశ్వరిలను ఆదివారం పలువురు ఉపాద్యాయులు,సిబ్బంది అభినందించారు%జూ

మోడీ ప్రభుత్వంలో ప్రజలపై మోయలేని భారాలు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

వంటనూనెలపై 20 నుండి 32.5శాతం వరకు దిగుమతి సుంకం విధించి మోడీ ప్రభుత్వం వంట నూనెలను మంట నూనెలుగా మార్చి పేద, మధ్య తరగతి ప్రజల మీద మోయలేని భారం మోపిందని చిలకలూరిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జి రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి ఎం.రాధాకష్ణ ఆదివారం తీవ్రంగా విమర్శించారు. స్థానిక ప్రధాన కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో పెద్ద మొత్తంలో దిగుమతి సుంకాన్ని విధించిన తొలి ప్రభుత్వంగా మోడీ ప్రభుత్వం నూతన రికార్డు సృష్టించిందన్నారు. సామాన్య మధ్యతరగతి ప్రజలు ఆహార పదార్థాలు అల్పాహారాలు కొని, తినే పరిస్థితి లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దిగుమతి సుంకం పెంపు వల్ల స్వీట్ షాపులు, హోటళ్ళు, తోపుడు బండ్లపై అల్పాహారం విక్రయించడం ద్వారా చిరువ్యాపారాలతో జీవనం సాగించే వారి ఆదాయానికి గండి పడుతుందని, తద్వారా అనేకమంది ఉపాధి అవకాశాలు కోల్పోతారని అన్నారు. ప్రతిరోజూ 30 లక్షల లీటర్ల వంట నూనెలు ఉపయోగించుకుంటున్న ఆంధ్రరాష్ట్ర ప్రజల మీద కేంద్ర ప్రభుత్వం విధించిన దిగుమతి సుంకం భారం పెద్ద ఎత్తున పడబోతుందని రాధాకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయాన్ని పెంచుకోవడమే ముఖ్యమని భావించింది తప్ప పేద, మధ్యతరగతి ప్రజలు పొట్ట నింపుకోవడానికి అవసరమైన ఆహార పదార్థాలు ఆకాశాన్నంటే విధంగా చేస్తున్నామనే విషయం విస్మరించారని రాధాకృష్ణ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పెంచిన దిగుమతి సుంకాన్ని తగ్గించాలని కష్టాల కడలి ఈదుతున్న ప్రజలపై పెనుభారాలు మోపే నిర్ణయాలు ఉపసంహరించు కోవాలని డిమాండు చేశారు.

నాగార్జున కొండను సందర్శించిన హైకోర్టు న్యాయమూర్తి

ప్రజాశక్తి - విజయపురిసౌత్



ప్రపంచంలోనే రెండవ ఐలాండ్ పురావస్తు మ్యూజియం అయిన నాగార్జున కొండను తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తి కె.సుజన కుటుంబ సమేతంగా ఆదివారం సందర్శించారు. అనంతరం నాగార్జున కొండపై ఉన్న పునర్నిర్మిత కట్టడాలైన సింహాల విహారము, మహాస్థూపము, అశ్వమేధయజ్ఞశాల మొదలగు ప్రాచీన కట్టడాలను వీక్షించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునకొండ చారిత్రక విశేషాలను వివరించారు. వీరితోపాటు స్థానిక సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్ గౌడ్, నిడమనూరు కోర్టు సూపరింటెండెంట్ చంద్రశేఖర్ శర్మ, ఆర్ఐ దండా శ్రీనివాస్రెడ్డి ఉన్నారు.

నేడు డాక్టర్ కోడెల 5వ వర్ధంతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మాజీ మంత్రి నవ్యాంధ్రప్రదేశ్ మాజీ తొలి సభాపతి దివంగత డాక్టర్ కోడెల శివప్రసాదరావు 5వ వర్ధంతి వేడుకలు సోమవారం గుంటూరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట నియోజకవర్గ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రభుత్వ వైద్యశాలలో అన్నదానం

ప్రజాశక్తి- మాచర్ల :వేముల సుబ్బారావు, వేముల మణికుమార్, వేముల కిరణ్కుమార్ ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆదివారం అన్న వితరణ గావించారు. ఆస్పత్రిలోని రోగులు, ఆస్పత్రి సిబ్బందికి డాక్టర్ కెపి.చారి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు సేవలు చేయటం మంచిదని, అందులోనూ అన్నదానం చాలా గొప్ప దానమని ఆకలితో ఉన్నవారిని ఆదుకోవాలని అన్నారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు వేముల మాధవి, కన్వీనర్ తుమ్మేపల్లి సాంబశివరావులు మాట్లాడుతూ సుబ్బారావు, మణికుమార్, కిరణ్కుమార్లు కోవిడ్ సమయంలో మరణించారని, వారి పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని, అందులో భాగంగానే ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో కొత్తమాసు గురుప్రసాద్, జర్నలిస్టు సంఘం నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు, అక్బర్, ఉప్పుతోళ్ళ రమేష్, ఓరుగంటి చెన్నకేశవరావు, పుణ్యమూర్తి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బుడమేరు వరదలు గుంటూరుకూ గుణపాఠం

ముంపు నివారణకు ముందస్తు కార్యాచరణ - డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగిస్తాం

నగరంలో పరిశుభ్రతకు ప్రాధాన్యం - ప్రజాశక్తితో కమిషనర్ పులి శ్రీనివాసులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విజయవాడలో బుడమేరు వల్ల వచ్చిన వరదలు గుంటూరుకు కూడా గుణపాఠమేనని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గుంటూరులో కూడా అతి భారీ వర్షం కురిస్తే ముంపు సమస్య వచ్చే అవకాశాలు లేకపోలేదని ఆయన తెలిపారు. వరదల నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు వారాల పాటు విజయ వాడలో ప్రత్యేకంగా విధులు నిర్వహించిన కమిషనర్ అక్కడి అనుభవాల నేపథ్యంలో గుంటూరులో ముంపు సమస్యలు రాకుండా తీసుకుంటున్న జాగ్రత్తలపై ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.





విజయవాడలో మీకు ఎదురయిన అనుభవాలు?

బుడమేరు గత కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురి కావడం వల్ల వరద నీరు ముందుకు పోవడంతో విజయవాడలో ముంపు సమస్య ఏర్పడింది. అతి భారీ వర్షాల వల్ల అనూహ్యంగా వరద వచ్చింది. వర్షం నీరు డ్రైన్ల లోకి వెళ్ళడానికి డ్రైన్ల పై ఆక్రమణలు పెరగడం ఒక కారణం అయితే భారీగా వచ్చిన వరదతో బుడమేరుకు గండి పడటం మరో కారణంగా నిలుస్తోంది. విజయవాడలోని 62వ డివిజన్ కు ప్రత్యేక అధికారిగా డ్రైన్ల ఆక్రమణలు ఎంతటి పెద్ద నష్టాన్నికల్గించాయో ప్రత్యక్షంగా పరిశీలించా. ఆక్రమణల వలన మేజర్ డ్రైన్లు బ్లాక్ అయ్యి, అంతర్గత డ్రైన్లు, రోడ్ల మీద నీరు వెళ్లడానికి వీలులేక ఇళ్ళల్లోకి చేరి ప్రజా జీవనాన్ని తీవ్రంగా ఇబ్బంది కల్గించింది. నూజివీడు రోడ్ లో షుమారు 5 కిలోమీటర్ల మేర డ్రైన్ల మీద ఆక్రమణలు తొలగించడం వల్లనే ఆయా ప్రాంతాలు వరద నీటిని బయటకు పంపగలిగాం.

ఇదే రీతిలో గుంటూరు పరిస్థితి ఏమిటీ?

గుంటూరులో కూడా మురుగునీరు, వర్షం నీరు బయటకు పోవడానికి చాలా ఇబ్బంది ఉంది. మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న డ్రైన్లపై ఆక్రమణలను సమగ్రంగా తొలగిస్తాం. కాల్వలో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలి. డ్రైన్ల పై ఆక్రమణల వలన పూడికతీత జరగడం లేదు. టన్నుల కొద్ది సిల్ట్ పేరుకుపోతోంది. ప్రధాన డ్రైన్ల పై ఆక్రమణల తొలగింపు ప్రారంభించాం. ఎక్కడా రాజీలేకుండా ఆక్రమణలను తొలగిస్తాం. డ్రైన్లపై ఆక్రమణల వల్ల వర్షం నీరు ముందుకు పోగా ఇళ్లల్లోకి వస్తుంది.

అక్రమణల తొలగింపుపై కార్యచరణ?

రాబోవు 10 రోజుల్లో డ్రైన్ల మీద ఆక్రమణలను వ్యాపారులు,ఇళ్ల నివాసితులు వారే స్వచ్ఛందంగా తొలగించుకోవాలి. లేదంటే జెసిబిల ద్వారా నగరపాలక సంస్థ సిబ్బంది తొలగిస్తారు. ఇప్పటికే రద్దీగా ఉండే ఓల్డ్ క్లబ్ రోడ్ డ్రైన్ ను పరిశీలించాం. పూడిక, వ్యర్థాలతో ఉండి, ఆక్రమణలతో ఉన్న డ్రైన్లను తొలగించమని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం.

వీధి వ్యాపారులపై నియంత్రణ?

వీధి వ్యాపారులపై నిబంధనల ప్రకారం జోన్ల వారీగా దుకాణాలకు స్థలం కేటాయిస్తారు. రెడ్ .జోన్‌లో అసలు దుకాణాలు పెట్టకూడదు. ఆరెంజ్ జోన్‌లో నిర్దేశిత సమయంలోనే దుకాణాలు పెట్టాలి. గ్రీన్ .జోన్‌లో దుకాణాలు పెట్టవచ్చు. ఈమేరకు .నగరంలో జోన్ల విభజన జరుగుతోంది. ఎక్కడబడితే అక్కడ దుకాణాల ఏర్పాటు వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

కార్పొరేషన్ ఆదాయం పెంపునకు చర్యలు?

నగరంలో ఆస్తి పన్నుతోపాటు వివిధ రూపాల్లో రావాల్సిన పన్నులను ఎప్పటికప్పుడు వసూలు చేసి ఆదాయం పెంపునకు కృషి చేస్తాం. ఆస్తి పన్ను వసూలులో లోపాలు, అనధికారిక కుళాయిలకు పన్ను ల విధింపు, ఖాళీ స్థలాల పన్ను, ట్రేడ్ లైసెన్సుల క్రమబద్ధీకరణ, ఆశీలు వసూలులో లోపాల నియంత్రణ, హోర్డింగ్ ద్వారా రావాల్సిన ఆదాయాన్ని రాబట్టడం, ఖాళీ స్థలాల పరిరక్షణ, పన్నుల వసూలులో అక్రమాలు నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

పరిశుభ్రత, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు?

ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశాం. నగరంలో సుందరీకరణతో పాటు నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్యం, దుర్గంధం లేని వాతావరణం కల్పిస్తాం.

రేపు నన్నపనేని లక్ష్మీ స్మారక పురస్కారాలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఆంధ్ర నాటక కళా సమితి, నన్నపనేని బాపనయ్య సీతారావమ్మ అండ్ లక్ష్మీ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 17వ తేదీన మంగళగిరి పట్టణంలోని గౌతమ్ బుద్ధ రోడ్డు రాయల్ బాంక్యాట్స్ లో శ్రీమతి నన్నపనేని లక్ష్మి స్మారక పురస్కారాలు అవార్డు ప్రధాన ఉత్సవం జరుగుతుందని అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరావు ఆదివారం తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ వై నాగేశ్వరావు, ప్రముఖ సంఘ సేవకురాలు ఏ రత్నలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. 2023 సంవత్సరమునకు డాక్టర్ కామినేని పట్టాభి రామయ్య, 2024 సంవత్సరమునకు డాక్టర్ పి అనూష అవార్డులకు ఎంపికైనట్లుగా తెలిపారు.

కుంచనపల్లిలో నాలుగు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

వినాయకుని నిమజ్జనం సందర్భంగా జై గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం సుమారు 4000 మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు జై గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అనంతరం వినాయకుని విగ్రహం వద్ద ఉన్న 27 కేజీల లడ్డును గ్రామానికి చెందిన అంగడి గోపి రూ.2,11,116లకు వేలం ద్వారా కైవసం చేసుకున్నారు. మరొక ఐదు కేజీల లడ్డును జి.వెంకటేశ్వరరావు రూ.33 వేలకు వేలం ద్వారా కైవసం చేసుకున్నారు. అనంతరం గణేష్ నిమజ్జనం సందర్భంగా భారీ సంఖ్యలో పెద్ద ఎత్తున భక్తులు మేళ తాళాలతో, బాణాసంచా కాల్చి, తీన్మార్ డీజేలతో ఊరేగింపును నిర్వహించారు. గ్రామంలోని వేలాది మంది భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జైగణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, టిడిపి తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, జనసేన గ్రామ అధ్యక్షులు మేకల రాజా, టిడిపి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన నాయకులు తోటకూర ప్రవీణ్, ఉప్పె వెంకయ్య, బొడ్డు శేఖర్, కొవ్వూరి సురేష్, పసుపులేటి అశోక్ పాల్గొన్నారు.



రూ.2,11,116కు లడ్డు కైవసం చేసుకున్న వేలంపాటదారులు



నిత్యవసరకులు పంపిణీ చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి

గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు పారేపల్లి మహేష్ ఆధ్వర్యంలో ఆదివారం యునైటెడ్ వే ఆఫ్ హైద్రాబాద్ సంస్థ, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సహకారంతో విజయవాడ, మంగళగిరి వరద ప్రభావిత ప్రాంతాలలో సహాయ నిమిత్తం 808 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వంట పాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైద్రాబాద్ సంస్థ ప్రతినిధులు కందురీ రాములు, ప్రశాంత్, జీవన్, సాయికిరణ్ పాల్గొన్నారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ నుండి ఆదిత్య వేదాంతం, సుమంత్, కష్ణ, వెంకట్, భరత్ యాసఫ్, పారేపల్లి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పారేపల్లి రామకష్ణ దంపతులు, గుంటూరు జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు వుడతా శ్రీనివాసరావు, జాయింట్ సెక్రెటరీ తిరువీధుల కిరణ్, మంగళగి రి పట్టణ సెక్రటరీ ఎనుముల నరసిం హారావు, పట్టణ ఉపాధ్యక్షుడు జంజనం వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర

వరద బాధిత లంక గ్రామాలను పూర్వస్థితికి తెచ్చి పూర్తిస్థాయిలో ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని మాజీ మంత్రి టిడిపి నాయకులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు ఆదివారం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలోని వరద బాధిత ప్రాంతమైన బొమ్మువాని పాలెం గ్రామంలో 300 మంది బాధితులకు నిత్యవసర సరుకులు, కూరగాయలు ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా సంస్థ అధ్యక్షులు కత్తెర సురేష్ మాస్ సంస్థ అధ్యక్షులు శుద్ధపల్లి నాగరాజు, గ్రామ సర్పంచి కొల్లి రజిని, వంగ సాంబిరెడ్డి భీమవరపు చిన్న కోటిరెడ్డి, గుది బండి గోవర్ధన రెడ్డి, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

పాత మంగళగిరి శ్రీకృష్ణ చైతన్య వృద్ధుల ఆశ్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు స్వర్గీయ ఆరుద్ర అంక వరప్రసాద్ పదో వర్ధంతి సందర్భంగా తెలుగు యువత నాయకులు బోగి సురేష్, బుర్రి గోపి ఆధ్వర్యంలో ఆదివారం వద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్వర్గీయ ఆరుద్ర కుమారుడు ఆరుద్ర శ్రీకాంత్ హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు పడమట రాధాకష్ణా యోగి గురూజీ, మండ్రు శ్రీనివాస్ కుమార్,టీడీపీ నాయకులు మున్నంగి శివ శేషగిరిరావు, తెలుగు యువత నాయకులు పుట్టపాకుల జోష్, పిన్నిగ సునీల్, ఆరుద్ర మహేష్, మోడీ గోపి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి జాతీయ స్థాయి ఎడ్ల పందేలు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

నేటి నుంచి జాతీయ స్థాయి ఒంగోలు జాతి పశు ప్రదర్శన పోటీలు ప్రారంభ మవుతున్నాయని టిడిపి మండల కన్వీనర్ గింజుపల్లి శివరామప్రసాద్ ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి మోమోరియల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఒంగోలు జాతి ప్రదర్శన జరుగుతుంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బుర్ల రామాజనేయులుచే మధ్యానం రెండు గంటలకు ప్రారంభం అవుతాయని తెలిపారు.

శానిటరి ఇన్‌స్పెక్టర్ బదిలీ

ప్రజాశక్తి - తెనాలి

పురపాలక సంఘంలో ఐదేళ్లుగా శానిటరి ఇన్‌స్పెక్టర్‌గా పని చేసిన ఆకురాతి రామచంద్రరావు రేపల్లె పురపాలక సంఘానికి బదిలీ అయ్యారు. ఆయన రాష్ట్ర శానిటరి ఇన్‌స్పెక్టర్ల అసోసియేషన్‌కు ఉపాధ్యక్షులుగా పనిచేస్తూ, ఆంధ్రా ప్యారిస్ మున్సిపల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులుగా మున్సిపల్ ఉద్యోగుల సమస్యలపై స్పందించేవారు. ఉద్యోగులకు అన్ని విధాలుగా సహాయకారిగా ఉండేవారు. ముఖ్యంగా ఉద్యోగుల కోసం హెల్త్ క్యాంపులు నిర్వహించటం, వివిధ సందర్భాలలో సాంస్కృతిక కార్యక్రమాలు, విహారయాత్రలు నిర్వహించడంలో చొరవ చూపేవారు. పారిశుద్యానికి సంబంధించి ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలకు పిలుపునిచ్చినా అందులో ఎంతో చురుగ్గా నిర్వహించేవారు. త్వరలో పదోన్నతి పొందే అవకాశం ఉన్న నేపథ్యంలో ఉద్యోగులంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉపకార వేతనాలు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి



పట్టణానికి చెందిన వాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య విద్యానిధి ఆధ్వర్యంలో ప్రతిభగల పేద వైశ్య విద్యార్థులకు ఉపకార వేతనాలను ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక వైశ్య విద్యానిధి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించేందుకు సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రతి ఏటా క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వహించడం విశేషమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యానిధి కమిటీ నాయకులు పెండేల వెంకటరావు, కౌన్సిలర్ దేసు యుగంధర్ పాల్గొన్నారు.

నలుగురు డిఎస్‌పిల బదిలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పలువురు డిఎస్‌పిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు డిజిపి ద్వారకాతిరుమల రావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. విఆర్‌లో ఉన్న ఎం.రమేష్‌ను గుంటూరు ట్రాఫిక్‌కు, గుంతకల్‌లో ఉన్న షేక్ అబ్దుల్ అజీజ్‌ను గుంటూరు తూర్పునకు, పిసి ఎస్‌లో ఉన్న ఎం.హనుమంతరావును సత్తెన పల్లికి, ఎమ్మిగనూర్‌లో ఉన్న బి.సీతా రామ య్యను గుంటూరు జిల్లా స్పెషల్ బ్రాంచికి బదిలీ చేశారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 16న సోమవారం 'మిలాద్ ఉన్ నబీ' పండుగ సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్టు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. దూం ప్రాంతాల నుండి ఫిర్యాదులు ఇవ్వడానికి వచ్చేవారికి పోలీసు అధికారులు ముందే సమాచారం ఇవ్వాలన్నారు.

ప్రైవేటు ట్యాంకర్లకు నీటి సరఫరా నిలుపుదల : కమిషనర్

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ తాగునీటి రిజర్వాయర్ల నుండి ప్రైవేట్ ట్యాంకర్లకు నీటి సరఫరా నిలుపుదల చేయాలని, త్వరలో ఆయా ట్యాంకర్లకు నీటిని అందించే అంశంపై నిర్ణయి స్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆదివారం కమిషనర్ గుజ్జనగుండ్ల, పెద్ద పలకలూరు రోడ్డులోని జిఎంసి రిజర్వాయర్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర ప్రజలందరికీ సమగ్రంగా నీటిని అందించేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేస్తున్నామని, అప్పటి వరకు ప్రైవేట్ ట్యాంకర్లకు తాగునీటిని సరఫరా నిలుపుదల చేయాలన్నారు. కొన్ని ప్రాంతాలకు అరకొరగా, మరి కొన్ని ప్రాంతాలకు అధికంగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. రిజ ర్వాయర్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచా లని, రిజర్వాయర్ శుభ్రం చేసిన తేదీని బోర్డ్ మీద రాయాలన్నారు. అనంతరం పెద్ద పలకలూరు, ఉద్యోగ నగర్ ప్రాంతాల్లో పర్య టించి ఆదివారం విధులకు హాజరు కాని ఎన్విరాన్మెంట్ కార్యదర్శులకు షోకాజ్ నోటీ సులు జారీ చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెడితే చర్యలు తీసుకుంటా మన్నారు. ఉద్యోగ నగర్‌లో నూతనంగా మంజూరైన రిజర్వాయర్ ఫైల్ వివరాలను ఏఈని అడిగి తెల్సుకొని, ఫైల్‌పై సమగ్ర వివరాలతో తనకు వివరించాలన్నారు. అనంతరం కమిషనర్ కొత్తపేట ఓల్డ్ క్లబ్ రోడ్ లో డ్రైన్ల ఆక్రమణలు తొలగింపు పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఓల్డ్‌క్లబ్ రోడ్డులో కొన్ని హాస్పిటల్స్ డ్రైన్‌పై స్లాబ్‌లు వేసి జనరేటర్లు, కార్ పార్కింగ్‌కు వినియోగిస్తున్నారని, దీని వలన డ్రైన్‌లో ఉన్న సిల్ట్ తీయడానికి వీలు లేకుండా పోతుందన్నారు. మురుగునీరు సక్రమంగా పారేలా చేయాలంటే డ్రైన్ మీద ఉన్న ప్రతి ఆక్రమణ తొలగించాల్సిందేనన్నారు.